మల్టీలెవల్ పార్కింగ్‌కు మోక్షం కలిగేనా ?

చార్మినార్: గత ఆరేళ్లుగా చార్మినార్‌లో జీహెచ్ ఎంసీ మల్టీలెవల్ పార్కింగ్‌తో పాటు ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణాల కోసం పాతబస్తీ ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణానికి తగిన ప్రణాళికలు రూపొందించి నిధుల మంజూరు కూడా జరిగింది. ఎన్నికలకు ముందు గతేడాది హడావుడిగా హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ గంపగుత్తగా పాతబస్తీలో చేపట్టిన ప్రారంభోత్సవాలలో భాగంగా చార్మినార్ మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణాలకు కూడా శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మల్టీలెవల్ పార్కింగ్‌కు మోక్షం లభిస్తుందా..! అని పాతబస్తీ ప్రజలు ఎదురు చూస్తున్నారు.

- గతంలో ఇక్కడ కొనసాగిన ఆర్టీసీ బస్‌స్టాండ్ భవనాన్ని కూల్చివేసి ఆరేళ్లు దాటినా.. ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో పాతబస్తీ ప్రజ లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వెంటనే పనులను ప్రారంభించి పూర్తిచేయాలని కోరుతున్నారు.

కింద ఆర్టీసీ బస్టాండ్..
పైన జీహెచ్ఎంసీ మల్టీలెవల్ పార్కింగ్...

- ప్రస్తుతం కోఠిలో ఉన్నట్లు కిందిభాగంలో ఆర్టీసీ బస్టాండ్.. పైన మల్టీలెవల్ పార్కింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. ఏళ్లతరబడి

- గత ఆరేళ్లుగా ఖాళీగా స్థలం
- చార్మినార్, మోతీగల్లీలలో నిర్మించనున్న మల్టీలెవల్ పార్కింగ్
- గతేడాది అసెంబ్లీలో ప్రస్తావించిన అక్బరుద్దీన్ ఒవైసీ
- 2018లో ఏళ్లతరబడి కొనసాగిన బస్టాండ్ తొలగింపు

కొనసాగిన ఆర్టీసీ బస్టాండ్‌ను పునరుద్ధరించడానికి మాజీమంత్రి కేటీఆర్ గతేడాది ఆగస్టులో జరిగిన శాసనసభలో తెలియజేయడంతో పాతబస్తీ ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేశారు.

అధికారులు విఫలం..

చార్మినార్‌లో గత ఆరేళ్లుగా శాశ్వత పరిష్కారంగా ఆర్టీసీ బస్టాండ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మల్టీలెవల్ కార్‌పార్కింగ్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి.

- జీహెచ్ఎంసీ మల్టీలెవల్ పార్కింగ్ సిస్టంను అందుబాటులోకి తెస్తామంటూ.. తొలగించిన చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయనే విషయాన్ని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ గతేడాది అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన అప్పటి మంత్రి కేటీఆర్ చార్మినార్‌తో పాటు మోతీగల్లీలోని ఓల్డ్ ఫించన్ పేమెంట్ కార్యాలయం ఖాళీ స్థలంలో కూడా రూ.47.95 కోట్ల నిధులతో మల్టీలెవల్ పార్కింగ్ నిర్మించనున్నట్లు వెల్లడించారు.
- కమర్షియల్ కాంప్లెక్స్ పద్ధతిలో సాధ్యమైనంత వెంటనే కార్యాచరణ చేపడతామని ఇచ్చిన హామీ నెరవేరలేదని ప్రజలు వాపోతున్నారు. ఆరేళ్ల క్రితం తొలగించిన చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో జీహెచ్ఎంసీ మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుతో పాటు ఆర్టీసీ బస్టాండ్ కూడా అందుబాటులోకి తీసుకురావడానికి సిద్ధమైనట్లు అప్పటి ప్రభుత్వం తెలిపింది.


మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణానికి ఖాళీగా ఉన్న స్థలం

బస్టాండ్ తొలగింపు..

జీహెచ్ఎంసీ మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తామంటూ ఇక్కడి ఆర్టీసీ బస్టాండ్ పాత భవన సముదాయాన్ని 2018 జనవరి 24న కూల్చివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ ఎలాంటి నిర్మాణ పనులు జరగకపోవడంతో ఖాళీ స్థలం ఏర్పడింది. అటు పార్కింగ్ నిర్మాణం జరగక.. ఇటు బస్టాండ్ లేకపోవడంతో పాతబస్తీ ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు.

- బస్టాండ్‌లను తొలగించిన సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పాతబస్తీలోని చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల ప్రయాణికులకు చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎంతో సౌకర్యంగా ఉండేది. ఎన్నో ఏళ్లుగా చార్మినార్ కట్టడం వద్ద కొనసాగిన ఆర్టీసీ బస్టాండ్ 1989లో సీపీపీ (చార్మినార్ పెడస్ట్రియన్ ప్రాజెక్టు) పనులకోసం పంచ్‌మొహల్లాకు తరలించారు.
- ఆర్టీసీ బస్టాండ్ తరలింపునకు ముందు పంచ్‌మొహల్లా డిపో కొనసాగేది. ఆర్టీసీ బస్సులను చార్మినార్ కట్టడం నుంచి పంచ్‌మొహల్లాకు తరలించిన అధికారులు 2005లో ఇక్కడి నుంచి తరలించడానికి కూడా ప్రణాళికలు రూపొందించారు.

చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను తరలిస్తామంటూ ముందుకురావడంతో ఇక్కడి స్థానిక చిరు వ్యాపారులతో పాటు ప్రయాణికులు, విద్యార్థినీవిద్యార్థులు పెద్దఎత్తున నిరసన చేపట్టారు. దీంతో మానవ హక్కుల కమిషన్ 2007లో పంచ్‌మొహల్లాలోనే చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్ కొనసాగాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో చార్మినార్ వద్ద మల్టీలెవల్ పార్కింగ్ ఎంతో అవసరం ఉందని గ్రహించిన ప్రభుత్వం 2018 జనవరి 24 నుంచి పూర్తిస్థాయిలో భవనాన్ని తొలగించడంతో చార్మినార్‌లో ఆర్టీసీ బస్సులను నిలపడానికి ఎలాంటి బస్టాండ్ లేకుండా పోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ ఎలాంటి నిర్మాణ పనులు జరగకపోవడంతో.. ఇక్కడ ఖాళీ స్థలం ఏర్పడింది. అటు పార్కింగ్ నిర్మాణం జరగక.. ఇటు బస్టాండ్ లేకపోవడంతో పాతబస్తీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


పల్లకి ఊరేగింపు దృశ్యం

నాంపల్లి : గురుస్వామి సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో సీతారామ్ భాగ్‌లోని లక్ష్మీనారాయణ దేవాలయంలో గురువారం రాత్రి అయ్యప్పస్వామి 19వ మహాపడి పూజ వైభవంగా జరిగింది. బుక్క అశోక్ (గురుస్వామి), బుక్క వినయ్‌గుప్తా, ప్రణవ్‌స్వామి ఆహ్వానం మేరకు అయ్యప్ప స్వాములు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వేదపండితులచే మహాపడిపూజ, అభిషేకాలు, పల్లకి ఊరేగింపు, అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి భజనలు, భక్తిగీతాల ఆలాపన ఆకట్టుకున్నాయి.

కేలండర్ ఆవిష్కరణ



అబిడ్స్ : తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్‌గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం సికింద్రాబాద్ డివిజన్ నూతన 2024 కేలండర్‌ను జాయింట్ కమీషనర్ వాసవి జగన్నాథం ఆవిష్కరించారు. శుక్రవారం జరిగిన ఈ ఆవిష్కరణలో డివిజన్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్, డిప్యూటీ కమిషనర్లు లక్ష్మణ్, శేషగిరి, కార్యదర్శి ప్రదీప్, కోశాధికారి శ్రీకాంత్‌గౌడ్, సురేష్, రాజేందర్, సుజాత, సయ్యద్ ఫైజల్, ఆదిత్య, హన్మంతరావు, వరుణ్, రమేష్‌నాయక్, ప్రవీణ్ తదితరులున్నారు.

ప్రజాపాలనతోనే ఆరు గ్యారంటీల అమలు


దరఖాస్తులను అందజేస్తున్న నిర్మల్‌కుమార్‌యాదవ్

అబిడ్స్ : ప్రజాపాలనతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని టీపీసీసీ ఓబీసీసెల్ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బేగంబజార్ ప్రజాపాలన కేంద్రంలో ఆయన హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు దరఖాస్తులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను 100 రోజుల్లోగా అందిస్తామన్నారు. బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు ఆపకుంటే తగిన మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. అశోక్, జయదీప్‌యాదవ్, బినయాదవ్, లక్ష్మీబాయి, హర్షయాదవ్ తదితరులున్నారు.

చెస్‌లో డీఏవీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

సంతోష్‌నగర్: డీఏవీ పాఠశాల నిర్వహించే నేషనల్ స్పోర్ట్స్‌లో ఈనెల 3,4,5వ తేదీల్లో డీఏవీ పబ్లిక్ స్కూల్ గురుగాంలో జరిగిన అండర్-14 బాలికల విభాగం చెస్ పోటీల్లో డీఏవీ సౌత్ విద్యార్థులు రజత పతకం సాధించారు. దీనిపై బ్రహ్మప్రకాశ్ డీఏవీ పాఠశాల విద్యార్థులు సోమిలి మన్నా, హాసిక, రిదిమ, తన్వీ విశేషంగా కృషి చేసిన డీఏవీ సౌత్‌జోన్ విజయానికి ప్రధానపాత్ర వహించారని ప్రిన్సిపాల్ వీ.ఎస్.ప్రశాంత్ అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పాఠశాల చైర్మన్ గౌరీశంకర్‌రావు, డీఏవీ పాఠశాల ఏ.ఆర్.ఓ వసంత ఎస్.రామన్, ఎల్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

సెంటర్ మార్పుతో దరఖాస్తుల వెల్లువ



లంగర్‌హౌస్ : ప్రజాపాలన కేంద్రాన్ని స్థానికంగా ఏర్పాటు చేయడంతో ఒక్కరోజులోనే అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. వివరాల ప్రకారం.. లంగర్‌హౌస్ బాపునగర్1,2, అంబేద్కర్‌నగర్ 1, 2, రెడ్డిబస్తీ తదితర ప్రాంతాల వారికి ప్రజాపాలన కేంద్రానికి దూరంగా ఉన్న ఇబ్రహీంబాగ్‌లో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని స్థానికంగా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం బి- బ్లాక్ అధ్యక్షుడు చంటిబాబు ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు రెండ్రోజుల క్రితం జోనల్ కమిషనర్‌కు కలిసి విన్నవించుకున్నారు. సానుకూలంగా స్పందించిన అధికారులు 5,6 తేదీల్లో బాపూనగర్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. శుక్రవారం బాపూనగర్‌లో దాదాపు 1300 దరఖాస్తులను అధికారులు తీసుకున్నారు. రఘుపాల్‌రెడ్డి, మాతంగి రమేష్, శ్యామ్‌రావు తదితరులున్నారు.

అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న ఛత్రినాక ఏసీపీ రమేష్

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి సన్నిధిలో స్థానిక భక్తుడు రంగ హరిగౌడ్ శుక్రవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఛత్రినాక, చార్మినార్ ఏసీపీలు రమేష్, రుద్ర భాస్కర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ భోజ్యానాయక్‌తో కలిసి ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు గౌడ్, లెనిన్‌బాబు, డీ.ఎల్.నర్సింగ్‌గౌడ్, అంబదాస్, కాశీనాథ్‌గౌడ్, భద్రీనాథ్‌గౌడ్ తదితరులున్నారు.

ఉచిత స్వెట్టర్ల పంపిణీ


పంపిణీ చేస్తున్న ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్

చార్మినార్: ఎముకలు కొరికే చలి నుంచి తమను తాము కాపాడుకోవడం కోసం పాతబస్తీలోని మసీదుల్లో పనిచేస్తున్న మౌజం,ఇమాంలకు స్వెట్టర్లు, మఫ్లర్లు, గ్లౌజులను ఉచితంగా అందజేస్తున్నట్లు ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ తెలిపారు. చంచల్‌గూడలోని పార్టీ కార్యాలయం వద్ద యాకుత్‌పురా నియోజకవర్గంలోని వారికి ముందుగా అందజేసినట్లు వివరించారు. అనంతరం పాతబస్తీలోని వారందరికీ ఉచితంగా అందజేయనున్నట్లు స్పష్టం చేశారు.

నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరికి జైలుశిక్ష

గౌలిపురా: నిబంధనలకు విరుద్ధంగా అర్ధరాత్రి దాటినా వ్యాపారాలు నిర్వహిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... భవానీనగర్ తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన అజ్మత్ అహ్మద్ (29), తలాబ్‌కట్టాకు చెందిన మహ్మద్ అలీ (44)లు వేర్వేరుగా పాన్ షాపులు నిర్వహిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ అర్ధరాత్రి వరకు వ్యాపారం చేస్తున్నారు. పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేసి నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా... న్యాయమూర్తి సత్యనారాయణ ఒకరికి 3, మరొకరికి 4 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. దీంతో పోలీసులు ఇద్దరిని జైలుకు తరలించారు. నిబంధనలు ఉల్లఘించిన వారిపై తగిన చర్యలు ఉంటాయని పోలీసులు తెలిపారు.

శస్త్రచికిత్సలపై వైద్య విద్యార్థులకు అవగాహన


సదస్సును ప్రారంభిస్తున్న హోమ్ చైర్మన్ డాక్టర్ తిమ్మారెడ్డి

సుల్తాన్‌బజార్ : ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చికిత్సలు, శస్త్ర చికిత్సలపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు హోమ్-2024 కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. దేశవ్యాప్తంగా ఆర్థోపెడిక్ రంగంలో వైద్య నిపుణులతో హోమ్ కార్యక్రమంలో అత్యధిక అరుదైన శస్త్రచికిత్సలపై డెమో ద్వారా అవగాహన కల్పించడం అభినందనీయమని, ప్రతి ఏటా ఇలాంటి సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు శుక్రవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో హైదరాబాద్ ఆర్థోపెడిక్ మెడికల్ ఎడ్యుకేషన్ - 2024 సదస్సు హోమ్ చైర్మన్ డాక్టర్ వై.తిమ్మారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా దేశంలో ప్రస్తుత వైద్యరంగంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఆ దిశగా నేటి యువ పీజీలకు ప్రస్తుత విద్య విధానంపై అవగాహన కల్పించేందుకు హోం ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, డాక్టర్ జి.రమేష్, డాక్టర్ కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, డాక్టర్ రామకృష్ణ, రవికిరణ్, సుధీర్, శివరాంనాయక్, సతీష్‌చంద్ర, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక ప్రార్థనల్లో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ


ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్ అలీ

చార్మినార్: మక్కామసీదులో శుక్రవారం జరిగిన సామూహిక ప్రార్థనల్లో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా అయోధ్య రామమందిరం నిర్మాణంపై ఆయన చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడిన నేపథ్యంలో ఈ శుక్రవారం మక్కా మసీదులో జరిగిన జుమ్మా ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. దీంతో దక్షిణ మండలం పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన ముస్లిం యువకులు ఆయనను కలిసి కరచాలనం చేయడానికి పోటీ పడ్డారు. చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫీకర్‌అలీ, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న అక్షింతల పంపిణీ


అక్షింతలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

విజయనగర్‌కాలనీ: అయోధ్యలో ఈనెల 22న భవ్య రామాలయ ప్రారంభోత్సవం, రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల నేపథ్యంలో బస్తీలు, కాలనీల్లో పండుగ వాతావరణం నెలకొంది. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఆసిఫ్‌నగర్ శంకర్‌నగర్‌లో శ్రీరాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం పర్వదినాన ఇంటిపెద్దతో అక్షింతలు తలపై వేయించుకుని ఆశీర్వచనం పొందాలన్నారు. సాయంత్రం ప్రతి ఇంటి ముందు ఐదు దీపాలు వెలిగించి దీపావళిని తలపించేలా సంబరాలు నిర్వహించుకోవాలని ప్రతినిధులు సూచించారు.

కళ్యాణ్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలి

ఎమ్మెల్యే రాజాసింగ్


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, సోమ్‌రాజ్‌సింగ్ తదితరులు

అబిడ్స్ : యువత దివంగత బీజేపీ మహానేత, మాజీ సీఎం కళ్యాణ్‌సింగ్ అడుగుజాడల్లో పయనిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. ధూల్‌పేట్ గంగాబౌలిలో కళ్యాణ్‌సింగ్ విగ్రహానికి కార్పొరేటర్లు లాల్‌సింగ్, శశికళ కృష్ణ, బీజేవైఎం గోషామహల్ కన్వీనర్ సోమ్‌రాజ్‌సింగ్‌లతో కలిసి నివాళులర్పించారు. అనంతరం రాజాసింగ్ మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి, సంస్కృతిని చాటేందుకు కళ్యాణ్‌సింగ్ చేసిన సేవలు అమోఘమన్నారు. హిందూధర్మాన్ని పెంపొందించేందుకు ఆయన ప్రత్యేక కృషి చేశారన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కృష్ణ, బీజేవైఎం కన్వీనర్ సోమ్‌రాజ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అమోఘం కూచిపూడి నృత్యం



గన్‌ఫౌండ్రీ : ప్రముఖ నృత్య సంస్థ నాట్య తరంగిణీ ఆధ్వర్యంలో నృత్య గురువులు పద్మభూషణ్ డాక్టర్ రాజారాధారెడ్డి, కౌసల్యరెడ్డి, యామినిరెడ్డిల శిష్యురాలు వైష్ణవి కూచిపూడి నాట్య రంగప్రవేశం శుక్రవారం రవీంద్రభారతిలో కనుల పండువగా సాగింది. వేంకటేశ్వర స్తోత్రం, దశావతారం, భామకలాపం, థిల్లాన, తరంగం, వంటి పలు అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ గాయని గాయకురాలు ఎస్పీ.శైలజ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సినీనటుడు కేపీ.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోల్కొండ: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలు సరికాదని, సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారంటీల పథకంపై కేటీఆర్ చేసిన ప్రకటనను నిరసిస్తూ.. కాంగ్రెస్ నేతలు శుక్రవారం రింగ్‌రోడ్డు లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారం కోల్పోగానే కేటీఆర్ ఇతరులను ఇష్టానుసారంగా కించపరుస్తూ.. మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పథకం పేద ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపిందన్నారు. ఇది సహించని ఆయన కాంగ్రెస్‌పై విషం కక్కుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కేవలం ఆ పార్టీ నాయకులకే లబ్ధిచేకూరాయన్నారు. ప్రజాదర్బార్‌లు నిర్వహించి ప్రజలే స్వయంగా ప్రజా సమక్షంలో దరఖాస్తులు చేసుకోవడం ప్రవేశపెట్టిన కాంగ్రెస్ పేదల పట్ల తనకు ఉన్న చిత్తశుద్ధిని ప్రకటించుకుందని వివరించారు. ఓపెన్ దరఖాస్తు విధానాన్ని కేటీఆర్ సహించలేదని ప్రజలే ఆయనకు సరైన గుణపాఠం చెబుతారన్నారు. కాంగ్రెస్ నాయకులు రఘుపాల్‌రెడ్డి, రామ్‌కుమార్, చంటిబాబు, గోవర్ధన్‌రెడ్డి, హబీబ్ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


గోల్కొండలో పర్యటిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ, టోలిచౌకి డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన టోలిచౌకీ నదీమ్‌కాలనీలో జరుగుతున్న బాక్స్‌టైప్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా నిర్దేశిత సమయంలో పూర్తిచేయాలని ఆయన గుత్తేదారును ఆదేశించారు. అనంతరం ఆయన గోల్కొండ డివిజన్‌లోని మోతీమహల్ చౌరస్తా, మోతీమహల్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మోతీమహల్ చౌరస్తా నుంచి మోతీదర్వాజ వరకు త్వరలోనే కొత్త పైపులైన్ పనులను చేపడతామన్నారు. ప్రస్తుతం ఉన్న డ్రైనేజీని పూర్తిగా తొలగించి దాని స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తామని వివరించారు. పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా అధికారులపై తగిన చర్యలు తీసుకుంటానన్నారు. స్థానిక మజ్లిస్ ఏరియా కమిటీ వారు సైతం తమ ప్రాంతంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తూ.. తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. మజ్లిస్ నాయకులు షకీల్ అలీఖాన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

విద్యార్థులకు ప్రత్యేకంగా ఉచిత బస్సులు నడపాలి

చార్మినార్: మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినప్పటి నుంచి కళాశాల విద్యార్థులకు సకాలంలో ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండటం లేదని ఏబీవీపీ కోఠి జిల్లా కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఏబీవీపీ సిటీ కాలేజీశాఖ ఆధ్వర్యంలో సిటీ కాలేజీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాలేజీ సమయాల్లో విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడపాలని డిమాండ్ చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ప్రత్యేక బస్సులు ఉండాలన్నారు. ఉచిత ప్రయాణం కారణంగా కాలేజీల నుంచి ఇంటికెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒక్కోసారి ఇంటికి వెళ్లడానికి రాత్రి 9-10 అవుతుందని, వారి సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రత్యేక బస్సులను నడపాలని ఆయన కోరారు. సజన్, రాహుల్, జితేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్ఎఫ్ఏయూ క్యాంటీన్ కార్మికుల ఆందోళన

- వేతనాలు చెల్లించాలని విధుల బహిష్కరణ
- నిలిచిపోయిన క్యాంటీన్ సేవలు


నిరసన చేస్తున్న కార్మికులు

నాంపల్లి : మూడునెలలుగా వేతనాలు చెల్లించడం లేదంటూ మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఎఫ్ఏయూ కళాశాలలోని క్యాంటీన్ కార్మికులు ఆందోళనకు దిగారు. విద్యార్థుల సౌకర్యార్థం గతేడాది ఆగస్టులో ఈ క్యాంటీన్‌ను ప్రారంభించారు. క్యాంటీన్‌ను దక్కించుకున్న నిర్వాహకులు ఇతర రాష్ట్రాల కార్మికులను క్యాంటీన్‌లో వివిధ రకాల పనుల నిమిత్తం నియమించుకుంది. ఉపాధికోసం పొట్ట చేతబట్టుకుని బిహార్, యూపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 16 మంది కార్మికులు నగరానికి రాగా.. జేఎన్ఎఫ్ఏయూ కళాశాలలో వంట మాస్టార్, వెయిటర్స్, డ్రైవర్స్, కేటరింగ్ పనుల్లో చేస్తున్నారు. అయితే వీరికి మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో విధులను బహిష్కరించారు. కార్మికులు విధులను బహిష్కరించడంతో క్యాంటీన్ గత రెండురోజులుగా సేవలు నిలిచిపోయాయి. కాగా శుక్రవారం కార్మికులు జేఎన్ఎఫ్ఏయూలో వేతనాలు చెల్లించాలంటూ కళాశాల ఎదుట నిరసన చేపట్టారు.

నిర్వాహకుల వివరణ..

ఈ విషయమై క్యాంటీన్ నిర్వాహకులు వెంకట్‌ను వివరణ కోరగా.. ఈనెల 26న వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చానని, అప్పటి వరకు కార్మికులంతా ఆగాల్సిందేనంటూ.. సమాధానం ఇచ్చారు. కాగా కార్మికులు విధులను బహిష్కరించడంతో కళాశాలలోని క్యాంటీన్‌లో సేవలు పూర్తిగా నిలిచిపోయాయని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్యాంటీన్ పనిచేయకపోవడంతో బయటి ప్రాంతాల్లోని హోటల్స్‌ను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయమై కళాశాల అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ప్రయోజనం లేకుండాపోయిందని, ఉన్నతాధికారులైనా స్పందించి వెంటనే కళాశాలలో క్యాంటీన్ పనిచేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రూ.80 వేలు బాకీపడ్డారు

మాది ఉత్తరప్రదేశ్. ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చాను. ఇక్కడి క్యాంటీన్‌లో మాస్టార్‌గా పనిచేస్తున్నాను. క్యాంటీన్ యజమాని నాకు రూ.80 వేల వరకు చెల్లించాల్సి ఉంది. వేతనాలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. ఓపిక నశించి విధులను బహిష్కరించాల్సి వచ్చింది.


–సతీష్, మాస్టార్

డబ్బులు ఇస్తాడనే నమ్మకం లేదు

క్యాంటీన్ నిర్వాహకులు డబ్బులు ఇస్తారనే నమ్మకంతో విధుల్లో చేరాను. మూడు నెలలు గడుస్తున్నా మాకు డబ్బులు ఇవ్వడం లేదు. మమ్మల్ని నమ్మించి డ్యూటీలోకి తీసుకున్నారు. నమ్మకంతో పనిచేసిన పాపానికి నిండా ముంచారు. అతడు మాకు వేతనాలు ఇస్తారనే నమ్మకం లేదు. కార్మికులుగా ఎవరు వచ్చినా ఇలాగే మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

– శ్యామ్‌కుమార్, బిహార్

గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్


స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న డాక్టర్ మజహర్‌ఉల్లా

గోల్కొండ: మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్‌ఉల్లా అన్నారు. శుక్రవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో కలిసి ఆసుపత్రి ఇన్‌వార్డు, అవుట్ వార్డు విభాగాలతో పాటు ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల శుభ్రత ఆరోగ్య పరిరక్షణలో మొదటి మెట్టు అని అన్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే రోగాలకు స్వాగతం పలుకుతున్నట్లు అవుతుందన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆసుపత్రి శుభ్రత ఒక కొత్త అనుభూతిని ఇస్తుందని పరిశుభ్రంగా ఉన్న ఆసుపత్రిని చూసి వారి సగం రోగం మటుమాయం అవుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రతపై తమ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాలు చేపడతామని వివరించారు. డాక్టర్ శ్రీనివాస్ రావు ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు ప్రజాపాలన పాదయాత్ర



నాంపల్లి : నియోజకవర్గంలోని అహ్మద్‌నగర్ డివిజన్‌లో రెండోరోజు ప్రజాపాలన పాదయాత్రను సీనియర్ కాంగ్రెస్‌నేత మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ చేపట్టారు. డివిజన్‌లోని పోచమ్మబస్తీ, చాచా నెహ్రూ పార్కు, దోబీఘాట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ అభయహస్తం గ్యారంటీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ దుర్గేష్, నేతలు ఎస్.లక్ష్మణ్ లాల్, పృథ్వీరాజ్, వీరూ, తీరత్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


రోస్‌మేరి (ఫైల్)

అబిడ్స్ : మంగళ్‌హాట్ పరిధిలోని గంగాబౌలిలో నివసించే ఓ గృహిణి అదృశ్యమైంది. గతనెల 24న గంగాబౌలిలో నివసించే రోస్‌మేరి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆమె ఆచూకీ లభిస్తే మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్సై సుబ్రమణ్యం తెలిపారు.